క్లుప్తంగా

నేడు కంకలమ్మ బోనాల జాతర

కౌటాల: మండల కేంద్రంలో కంకలమ్మ దేవి ఆషాఢ బోనాల జాతర ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సుల్వ కనకయ్య శనివారం తెలిపారు. నేడు ఉదయం 10 గంటలకు ఆలయంలో బోనాల జాతర నిర్వహిస్తామన్నారు. కంకలమ్మకు బోనాలను సమర్పించిన అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. బోనాల జాతర కోసం భక్తులకు ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలోని భక్తులు బోనాల జాతరకు తరలిరావాలని ఆయన కోరారు.

ఇంటర్ ప్రవేశాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

దహెగాం: మండల కేంద్రంలోని స్థానిక కస్తూరిబా గాంధీ విద్యాలయంలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఎస్‌వో జ్యోతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ 30 సీట్లు, బైపీసీలో 5 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హత కలిగిన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని, హాస్టల్ వసతి, ఉచిత విద్య, యూనిఫాం అందిస్తామని తెలిపారు. విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం చేస్తున్న పోలీసులు

లింగాపూర్: సిర్పూర్(యూ) మండలం పుల్లార గ్రామపంచాయతీ పరిధి తుమ్మగూడ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన మర్సుకోల కృష్ణ కర్ణాటక రాష్ట్రం రాయ్‌చూర్ యూనివర్సిటీలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. నిరుపేద విద్యార్థి కావడంతో ఆదివాసీ పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ తరుపున అతడికి శనివారం రూ.22వేలు ఆర్థికసాయం అందజేశారు. సిబ్బంది గోవింద్, వెంకటరమణ, బహదూర్‌షా, శంకర్ తదితరులు ఉన్నారు.

పాఠశాలల్లో బోనాల సంబరాలు



ఆసిఫాబాద్‌రూరల్: బోనాలతో విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో శనివారం బోనాల సంబరాలను విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు బోనాలు ఎత్తుకుని అమ్మవారికి బోనం సమర్పించారు. విద్యార్థులు అమ్మవారి, పోతురాజు వేషధారణ అలరించాయి. ప్రిన్సిపాల్ అరుణశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ అనిత, ఉపాధ్యాయులు ప్రవంతి, మహేశ్వరి, వెంకటేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

రెబ్బెన: మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శనివారం బోనాల పండుగ సంబరాలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని రెబ్బెన ఇంగ్లిష్ మీడియం పాఠశాలతో పాటు, ఎస్వీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో వేడుకలు నిర్వహించారు.

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం



రాజేందర్‌ను సన్మానిస్తున్న వ్యాపారులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రాజేందర్‌ను కాగజ్‌నగర్ వస్త్ర వ్యాపారులు ఘనంగా సన్మానించారు. అనంతరం మెయిన్‌మార్కెట్‌లో నెలకొన్న సమస్యలు ఆయనకు వివరించారు. ఏళ్ల క్రితం కట్టిన నాలాలు చిన్నవిగా మారడంతో ఇబ్బందులకు గురవుతున్నామని, నాలాలు విస్తరించాలని కోరారు. మాజీ కౌన్సిలర్ సిందం శ్రీనివాస్, వస్త్రవ్యాపారుల సంఘం అధ్యక్షుడు వొడ్నాల వెంకన్న, సభ్యులు శేఖర్, శ్రీనివాస్, మధుకర్, సోనూ పాల్గొన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

జైనూర్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సీఐ రమేశ్, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్ రావులు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పోలీసులు మీకోసంలో భాగంగా వాలీబాల్ క్రీడా పోటీలు నిర్వహించారు. ఎస్సై రవికుమార్, గంగన్న, కుమురంభీం మనుమడు కుమ్ర సోనేరావు, హన్నుపటేల్, కనక సుదర్శన్, ఆత్రం అనిల్, హైదర్ వసీం, కొడప సోనేరావు తదితరులు ఉన్నారు.

దోమల నివారణకు చర్యలేవి..?

- మూలనపడ్డ ఫాగింగ్ యంత్రాలు
- గ్రామాల్లో పెరుగుతున్న దోమల వ్యాప్తి
- పట్టించుకోని అధికారులు



మండల కేంద్రంలో గతేడాది ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

వాంకిడి: అసలే గ్రామాల్లో పారిశుద్ధ్యం అంతంత మాత్రమే ఉంటుంది. వర్షాకాలం వచ్చిందంటే పరిస్థితులు మరింత దారుణంగా మారుతుంటాయి. ఎక్కడ పడితే అక్కడ వరద నీరు నిల్వ ఉండి, మురికి కాలువలు నిండి కాలనీలు అధ్వానంగా మారుతాయి. దోమలు, ఈగల వ్యాప్తి విపరీతంగా పెరిగి ప్రజలు మలేరియా, డెంగీ, డయేరియా, చికెన్‌గున్యా వంటి రోగాల బారిన పడుతుంటారు. అయితే గ్రామీణ ప్రజలను సీజనల్ వ్యాధుల బారిన పడకుండా కాపాడేందుకు వర్షాకాలంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం అధికారులను ఆదేశిస్తున్నా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. వానాకాలంలో ప్రత్యేకించి దోమల నివారణకు చర్యలు చేపట్టాల్సి ఉండగా వానాకాలం ప్రారంభమై నెల గడుస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

నిరుపయోగంగా ఫాగింగ్ యంత్రాలు ..

వానాకాలంలో దోమల నివారణకు గతంలో పంచాయతీలు ఫాగింగ్ యంత్రాలు కొనుగోలు చేశాయి. నిధులు తక్కువగా ఉండే జీపీలు వేరే జీపీల నుంచి తీసుకుని వాడుకునేలా అధికారులు చర్యలు తీసుకునేవారు. గతేడాది వరకు అడపదడపా వాటి వినియోగం కనిపించినా ఈ ఏడాది మాత్రం నామమాత్రంగా కూడా కన్పించడం లేదు. మండలంలోని ఏ ఒక్క జీపీలో వీటిని వినియోగించడం లేదు. ఒక్కొక్క పొగ యంత్రానికి రూ.40 వేల -రూ.60 వేలు జీపీ నిధులు వెచ్చించి కొనుగోలు చేశారు. వాటి వినియోగంపై అవగాహన లేక పెట్రోల్, డీజిల్, లిక్విడ్ సమపాళ్లలో కలపకపోవడంతో తరుచూ పాడవుతున్నాయని తెలుస్తోంది. మళ్లీ మరమ్మతులు చేయించాలంటే ఖర్చు భారీగా అవుతున్నట్లు సమాచారం. దీంతో గతేడాది పాడైపోయిన యంత్రాలు ఇప్పటివరకు మరమ్మతులకు నోచుకోలేదు. నిధులు లేమితో యంత్రాలు గ్రామ పంచాయతీ కేంద్రాల్లో మూలకు పడ్డాయి.

నిధుల లేమి..

గత ప్రభుత్వం దోమల నివారణకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టింది. ప్రతీ గ్రామ పంచాయతీ ఫాగింగ్ యంత్రాలు కొనుగోలు చేసుకునేలా నిధులు కేటాయించింది. గతేడాది ప్రస్తుత ప్రభుత్వం 'స్వచ్ఛదనం -పచ్చదనం' కార్యక్రమాన్ని చేపట్టగా ఈ ఏడాది కార్యక్రమ ప్రభావం కానరావడం లేదు. పారిశుద్ధ్య పనులపై గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శులను ప్రశ్నిస్తుండగా నిర్వహణకు నిధులు లేవని వారు చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనేక గ్రామ పంచాయతీలలో ఎక్కడ పడితే అక్కడ చెత్త కుప్పలు, నిండుగా మురికి కాలువలు, అంతర్గత రహదారులపై మురికి నీరు పారుతుండటం వంటివి దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం గ్రామాలలో దోమలు విపరీతంగా పెరుగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం నిల్వ నీటి మడుగుల్లో ఆయిల్ బాల్స్ వేయడం వంటి చర్యలు కూడా తీసుకోవడం లేదు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా ఫాగింగ్ యంత్రాలను వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం..



గ్రామాల్లో పారిశుద్ధ్యం నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులతో ప్రతీ బుధవారం ప్రత్యేక సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నాం. డ్రైడే నిర్వహణ, నిల్వ నీటిలో ఆయిల్ బాల్స్ వేయడం వంటి చర్యలు తీసుకుంటున్నాం. ఫాగింగ్ యంత్రాలు కూడా అందుబాటులో ఉన్నాయి. గ్రామాల్లో దోమల నివారణకు చర్యలు తీసుకుంటాం. పాడైన ఫాగింగ్ యంత్రాలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకొస్తాం.

– ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో



ప్రకృతి ప్రసాదం.. సెలయేటి అందం

అడవుల్లో చిన్నచిన్న సెలయేటి ప్రవాహాలు ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తుంటాయి. చుట్టూ పచ్చని చెట్లు, రాళ్ల మధ్యలోంచి ప్రవహిస్తూ చూపరులను కట్టిపడేస్తాయి. కాగజ్‌నగర్ డివిజన్‌లోని అడవుల్లో ఇలాంటి ఆహ్లాదాన్నిచ్చే ప్రకృతి అందాలకు కొదువ లేదు. వర్షాలు కురుస్తున్న సమయంలో స్వచ్ఛమైన నీటితో ప్రవహించే సహజమైన సెలయేళ్లను బెజ్జూర్ మండలం గుండెపల్లి అటవీ ప్రాంతంలో 'సాక్షి' కెమెరా క్లిక్‌మన్పించింది.

– చింతలమానెపల్లి



నిరుద్యోగ ర్యాలీ జయప్రదం చేయాలి

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 22న నిర్వహించనున్న నిరుద్యోగ ర్యాలీలో పాల్గొని మద్దతు తెలపాలని నిరుద్యోగ జేఏసీ నాయకులు శనివారం మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్పీఎం మిల్లులో స్థానికులకే ఉద్యోగాలు కల్పించాలని, ఎస్పీఎం యాజమాన్యం నిరుద్యోగులతో చర్చలు నిర్వహించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ జేఏసీ నాయకులు పొన్న రమేశ్, శ్రీకాంత్, శ్రీనివాస్, నిరుద్యోగులు ఉన్నారు.



కోనేరు కోనప్పతో జేఏసీ నాయకులు

పాత పీహెచ్‌సీ స్థల పరిశీలన



పాత పీహెచ్‌సీ స్థలాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా

కౌటాల: మండల కేంద్రంలోని పాత ప్రాథమిక ఆరోగ్యకేంద్రం స్థలాన్ని శనివారం కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా పరిశీలించారు. పాత పీహెచ్‌సీ స్థలంలో నూతనంగా నిర్మించిన హెల్త్ సబ్‌సెంటర్‌ను పరిశీలించి త్వరలో దానిని ప్రారంభించి వినియోగంలోకి తీసుకురానున్నట్లు తెలిపారు. అధ్వానంగా ఉన్న పాత పీహెచ్‌సీ స్థలాన్ని పూర్తిగా చదును చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని పరిశీలించారు. ఆస్పత్రిలో సౌకర్యాలు, సిబ్బంది కొరతపై ఆరా తీశారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట తహసీల్దార్ ప్రమోద్, ఎంపీడీవో రమేశ్, వైద్యాధికారి పవన్‌కళ్యాణ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ తదితరులున్నారు.

జీవో 49 వెంటనే రద్దు చేయాలి



మాట్లాడుతున్న భరత్



మాట్లాడుతున్న రాజేశ్వర్

కెరమెరి: జీవో నంబర్ 49ను వెంటనే రద్దు చేయాలని పేసా మండల కమిటీ ఇన్‌చార్జి మడావి భరత్ అన్నారు. మండలంలోని చౌపన్‌గూడ గ్రామంలో శనివారం పేసా గ్రామసభ తీర్మానం చేశారు. ఆయన మాట్లాడుతూ 49 జీవోతో ఆదివాసీల బతుకులు, సంస్కృతి సంప్రదాయాలు ఛిన్నాభిన్నం చేసే కుట్ర జరుగుతుందని ఆరోపించారు. ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలని ఆదివాసీలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాయిసెంటర్ సార్మేడి ఆత్రం బొజ్జిరావు, పేసా మొబలైజర్ ఆడ ఆనంద్‌రావు, కెర్సెంగ యాదోరావు, గ్రామస్తులు కుర్సెంగ దుందేరావు, ఆత్రం రాము, వసంత్, భీంరావు తదితరులు ఉన్నారు.

ఆదివాసీల బతుకులు నాశనం

కెరమెరి: ఆదివాసీల బతుకులను నాశనం చేయడమే ప్రభుత్వాలు ధ్యేయంగా పెట్టుకున్నాయని రాజ్‌గోండ్ సేవా సమితి మండల ఉపాధ్యక్షుడు పెందోర్ రాజేశ్వర్ విమర్శించారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఐదవ షెడ్యూల్ ప్రాంతంలోని భారత రాజ్యాంగం పొందుపర్చిన 1/70, పేసా చట్టాలను, ఆదివాసీల అస్తిత్వాన్ని, మనుగడ, హక్కుల జీవోలను ఉల్లంఘిస్తూ గ్రామసభల తీర్మానం లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కన్జర్వేషన్ కారిడార్ పేరిట తీసుకొచ్చిన జీవో 49 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 21న తుడుందెబ్బ ఆధ్వర్యంలో జిల్లా బంద్‌కు ఇచ్చిన పిలుపుమేరకు అన్ని వర్గాల వ్యాపారులు, విద్యా సంస్థలు, బంద్ పాటించాలన్నారు. నాయకులు సిడాం జగన్నాథ్‌రావు, మూట ఎల్లయ్య, మడావి రాజు, శంకర్, బక్కయ్య తదితరులు ఉన్నారు.

ఆసిఫాబాద్: జీవో 49ను ప్రభుత్వం విరమించుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కౌటగూడ, గోండుగూడ, దద్పాపూర్ గ్రామాల్లో కరపత్రాలతో ప్రచారం చేశారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



కేజీబీవీలో భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

దహెగాం: కేజీబీవీ, ఆశ్రమ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో అల్బర్ట్, ఎంఈవో శ్రీనివాస్‌లు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేశారు. పరిసరాలను పరిశీలించడంతో పాటు, భోజనశాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని ఆరా తీశారు. ఎస్‌వో జ్యోతి తదితరులు ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి..

లింగాపూర్: మండలంలోని కంచన్‌పల్లి ఆశ్రమ పాఠశాలలో శనివారం డిప్యూటీ తహసీల్దార్ పెద్దిరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం అందించాలన్నారు. అనంతరం వంట గదిలో ఉన్న సామగ్రి, కూరగాయలు, స్నానాల గదులు పరిశీలించారు.

ఎస్సీ హాస్టల్ పరిశీలన

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను ఎంపీడీవో కోట ప్రసాద్ శనివారం సందర్శించారు. హాస్టల్‌లో స్టోర్‌రూం, వంటగది, సరకులు పరిశీలించారు. వారు మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని హాస్టల్ వార్డెన్‌కు సూచించారు.

కౌటాల: హాస్టల్‌లోని విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని తహసీల్దార్ ప్రమోద్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బీసీహాస్టల్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లో మెనూ పకడ్బందీగా అమలు చేయాలన్నారు. హాస్టల్‌ను పరిశుభ్రంగా ఉంచాలని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థులు అనారోగ్యం బారిన పడితే వెంటనే ఆస్పత్రికి తరలించాలని తెలిపారు.

ఆధార్ కేంద్రం లేక ప్రజల అవస్థలు

- లింగాపూర్‌లో మూతపడిన ఆధార్‌సెంటర్
- తప్పుల సవరణకు ఇతర ప్రాంతాలకు వెళ్తున్న వైనం
- ఏడాది కాలంగా ఇబ్బందులు
- స్థానిక సెంటర్‌ను పునరుద్ధరించాలని డిమాండ్



తహసీల్దార్ కార్యాలయంలో మూసి ఉన్న ఆధార్ కేంద్రం

లింగాపూర్: మండల కేంద్రంలో ఆధార్ సేవల కేంద్రం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత రోజుల్లో ప్రతీ అంశం ఆధార్‌తో ముడిపడి ఉంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పంట విక్రయాలు, పాఠశాల అడ్మిషన్లు వంటి వాటికి ఆధార్‌కార్డు తప్పనిసరిగా మారింది. ఆధార్‌లో చిరునామా మార్పులకు, చిన్నారులకు కొత్తగా ఆధార్ తీసుకునేందుకు వేలిముద్రలు అప్‌డేట్ చేసేందుకు ఆధార్ కేంద్రాల వద్దకు పరుగులు తీయాల్సిందే. కాగా మండల కేంద్రంలోని ఆధార్ సెంటర్ మూసివేయడంతో మండలవాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఆధార్‌లో మార్పుల కోసం సిర్పూర్(యూ), ఉట్నూర్, ఆదిలాబాద్ ప్రాంతాల్లో ఉన్న ఆధార్ సెంటర్లకు పరుగులు తీస్తున్నారు. దీంతో సమయం వృథా కావడంతో పాటు ఆర్థికంగానూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఆరు నెలలుగా మూసివేత..

ఆరు నెలల క్రితం వరకు మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ ఉండేది. తహసీల్దార్ కార్యాలయంలోని ఓ గదిలో నిర్వాహకుడు ఆధార్‌సెంటర్ నిర్వహించేవాడు. సదరు నిర్వాహకుడు రూ.3 లక్షలు వెచ్చించి కంప్యూటర్, ఫర్నీచర్‌తో పాటు ఇతర సామగ్రి కొనుగోలు చేశాడు. సంవత్సరం పాటు బాగానే నడిచిన ఆధార్ సెంటర్‌ను ఆరు నెలలుగా తెరువడం లేదు. ఆధార్‌సెంటర్‌లోని దరఖాస్తులు ఎక్కువగా తిరస్కరణకు గురవుతున్నందున ఆధార్ సెంటర్ ఐడీని బ్లాక్ చేసినట్లు అప్పట్లో అధికారులు తెలిపారు. మళ్లీ పరీక్ష నిర్వహించి అర్హులైన వారికి ఆధార్ సెంటర్ అప్పగిస్తామని చెప్పిన అధికారులు ప్రస్తుతం దాని ఊసే ఎత్తడం లేదు. దీంతో మండలవాసులు ఆధార్‌లో మార్పులకు ఇబ్బందులు పడుతున్నారు.

ఇబ్బందులు తప్పడం లేదు



మాది కీమానాయక్ తండా. నా కుమారుడికి ఏడు సంవత్సరాలు. కొత్త ఆధార్ కార్డు కోసం లింగాపూర్ ఆధార్‌సెంటర్‌లో అప్పట్లో దరఖాస్తు చేస్తే తిరస్కరణకు గురైంది. ప్రస్తుతం ఆధార్‌కార్డు కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది.

– చవాన్ మహేందర్, కీమానాయక్ తండా

అందుబాటులోకి తేవాలి



మండల వాసులకు అందుబాటులో ఉండేలా ఆధార్‌సెంటర్ పునరుద్ధరించాలి. ఈ రోజుల్లో అన్ని పనులకు ఆధార్‌కార్డు తప్పనిసరిగా మారింది. అధికారులు చొరవ తీసుకుని ఆధార్ సెంటర్ ప్రారంభించేందుకు కృషి చేయాలి.

– సురేశ్ నాయక్, బీజేపీ మండలాధ్యక్షుడు

ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలని వినతి

రెబ్బెన: ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఉన్న ఏకైక రైల్వేస్టేషన్ ఆసిఫాబాద్ రోడ్ రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ కల్పించాలని బీజేపీ మండల అధ్యక్షుడు మల్రాజు రాంబాబు కోరారు. శనివారం కాజీపేట్ రైల్వేస్టేషన్‌కు వచ్చిన కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ ఆసిఫాబాద్ రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ లేకపోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లే స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. స్టేషన్‌లో కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, అండమాన్, కాజీపేట్ బల్లార్షా ఎక్స్‌ప్రెస్‌తో పాటు కేరళ ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టింగ్ ఇవ్వాలన్నారు. మండల కేంద్రంలోని గంగాపూర్ రైల్వేగేట్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరగా ప్రారంభమయ్యేలా చూడాలని, ఆసిఫాబాద్ రోడ్ రైల్వేస్టేషన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని కోరారు.

మహిళల గోరింటాకు సంబరాలు



ఆసిఫాబాద్: గోరింటాకుతో విద్యార్థినులు



రెబ్బెన: గోరింటాకు చూపుతున్న మహిళలు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి టౌన్‌షిప్‌లో గల కార్మిక కాలనీల మహిళలు ఆషాఢమాసం పురస్కరించుకుని శనివారం గోరింటాకు సంబరాలు జరుపుకున్నారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోరింటాకు చేతులకు పెట్టుకున్నారు.

ఆసిఫాబాద్: జిల్లాకేంద్రంలోని శిశుమందిర్ పాఠశాలలో శనివారం విద్యార్థులు ఆషాఢమాసం గోరింటాకు సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు పరస్పరం గోరింటాకు పెట్టుకున్నారు. ఆచార్యులు గోరింటాకు ప్రాధాన్యత వివరించారు. హెచ్‌ఎం గుండేటి కోటేశ్వర్ రావు, ఆచార్యులు శారద, హరిత, సరిత, అమరావతి, అరుణ, శైలజ, ఆచార్యులు పాల్గొన్నారు.

దారిలో నడిచేదెలా..?



అధ్వానంగా మురళీగూడ రహదారి

పెంచికల్‌పేట్: మండలంలోని మురళీగూడ గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారిపైన రాళ్లు తేలాయి. గ్రామానికి చేరుకోవడానికి తీవ్రంగా అవస్థలు పడుతున్నామని, అత్యవసర సమయంలో అంబులెన్స్ కూడా వచ్చే పరిస్థితులు లేవని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.